నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 22 అక్టోబర్ 2024 | NALGONDA

## 20 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



20 క్రస్ట్ గేట్ల నుంచి దుంకుతున్న నీళ్లు

నందికొండ, అక్టోబర్ 21 : నాగార్జున సాగర్ జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతుండడంతో సోమవారం 20 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,22,147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, డ్యాం 16 క్రస్ట్ గేట్లు 5 అడుగులు, 4 క్రస్ట్ గేట్లు 10 అడుగులు ఎత్తి 1,87,172 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులకు గానూ 589.00 (309.3558 టీఎంసీల) అడుగుల మేర నీరున్నది. ఎడమ కాల్వ ద్వారా 6,173 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 9,047, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 25,100, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

# అదానీ సి'మంటలు'

## అంబుజా పరిశ్రమకు వ్యతిరేకంగా పోరు ఉధృతం

- ఆందోళనలు, నిరసనలతో సర్కారుపై ఒత్తిడి
- ఉద్యమానికి సబ్బండ వర్గాల మద్దతు
- కుల సంఘాలతో రోజుకో కార్యక్రమం
- పరిశ్రమను అడ్డుకుని తీరుతామని శపథం



రామన్నపేటలో అదానీ కంపెనీకి చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదిత స్థలం

**రామన్నపేటలో అదానీకి చెందిన అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటు ప్రతిపాదనలపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికుతున్నది. జంగ్ సైరన్ మోగుతున్నది. పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరు ఉధృతమైంది. ఉద్యమానికి సబ్బండ వర్గాల నుంచి రోజురోజుకూ మద్దతు పెరుగుతున్నది.**

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ)/రామన్నపేట

రామన్నపేటలో అదానీ సంస్థ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.1,400 కోట్లు ఖర్చు చేయనున్నది. గతంలో ఇక్కడ డ్రైపోర్టు పేరుతో రైతుల నుంచి కొనుగోలు చేసిన 365 ఎకరాల్లోని 65.6 ఎకరాల్లో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. ఇది ఏర్పాటుచేస్తే రామన్నపేటతోపాటు వలిగొండ, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లోని పలు గ్రామాలను కాలుష్య కూపాలుగా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే పరిశ్రమ ఏర్పాటును ఇక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

### ప్రభుత్వంపై పెరుగుతున్న ఒత్తిడి..

సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పోరాటం చేస్తున్నారు. ఏకంగా సర్కారుపై తిరుగుబాటు చేస్తున్నారు. అన్ని పార్టీలు ఏకతాటి పైకి వచ్చాయి. అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి కార్యచరణ రూపొందించారు. పార్టీలతో సంబంధం లేకుండా పర్యావరణ పరిరక్షణ వేదికను ఏర్పాటు చేశారు. పరిశ్రమ వస్తే జరిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వేదిక ఆధ్వర్యంలోనే పోరు కొనసాగిస్తున్నారు. రోజుకో కార్యక్రమం చేపడుతున్నారు. ఇప్పటికే వివిధ రూపాల్లో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. మేధావులతో సదస్సులు ఏర్పాటు చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. దాంతో రోజురోజుకూ ప్రభుత్వం ఒత్తిడి పెరుగుతున్నది.

### కంపెనీ ఏర్పాటును అడ్డుకుంటాం



జనావాసాలకు కూతవేటు దూరంలో ఏర్పాటు చేస్తామంటున్న అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటును అడ్డుకొని తీరుతాం. కంపెనీ ఏర్పాటు అయితే జనం జీవచ్ఛాలు కావాల్సిందే. ఈ నెల 23న నిర్వహించే ప్రాజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి నిరసన తెలపాలి.

-మిర్యాల మల్లేశం, రామన్నపేట

### జీవాలకు గడ్డి కూడా దొరకదు



రామన్నపేట పరిసరాల్లో సుమారు 10 వేలకు పైగా కుటుంబాలు గొర్లు, మేకలు, పెంచుకుంటూ బతుకుతున్నాయి. సిమెంటు పరిశ్రమ పెడితే దానివల్ల వచ్చే దుమ్ము భూమి మీద పర్చుకొని గడ్డి మొలవదు. జీవాలకు మేయడానికి గడ్డి కూడా దొరకదు. గొర్రెల పెంపకందారుల కుటుంబాలు వీధిన పడుతాయి.

-ఆవుల యాదయ్య, గొర్రెల కాపరి, నీర్నెముల

### సబ్బండ వర్గాల మద్దతు..

అంబుజా సిమెంట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరుకు అన్ని వర్గాలు మద్దతు తెలుపుతున్నాయి. ఉద్యమం ఏ ఒక్కరి కోసమో కాదని, అందరం కలిసిగట్టుగా ముందుకెళ్దామని పోరాటానికి నడుం బిగిస్తున్నాయి. పరిశ్రమతో కులవృత్తులు ఆగమయ్యే పరిస్థితి ఉండడంతో రోజుకో కుల సంఘం ఉద్యమాన్ని భుజానికెత్తుకుంటున్నాయి. ఇటీవల పద్మశాలీలు, ముదిరాజ్, యాదవ్‌లతోపాటు మైనార్టీలు వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. విద్యార్థులు పెద్దఎత్తున చేపట్టిన ధర్నాకు మంచి స్పందన వచ్చింది. ఈ నెల 23 రామన్నపేటలో ప్రజాభిప్రాయ సేకరణ ఉండగా, ఎట్టిపరిస్థితుల్లోనూ పరిశ్రమను అడ్డుకుంటామని ప్రజలు శపథం చేస్తున్నారు.

### చేనేత మనగడకు ముప్పు



రామన్నపేట మండలంలో వ్యవసాయం తరువాత ఎక్కువ కుటుంబాలు చేనేత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అనేకమందికి చేనేత తప్ప మరో పని తెలియదు. ఇక్కడ సిమెంట్ పరిశ్రమ ఏర్పడితే చేనేత వృత్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది. చేనేతలో అర కట్టడం, రంగులు అద్దడం వంటి ప్రక్రియలు ఆరు బయట చేయాల్సి ఉంటుంది. సిమెంట్ పరిశ్రమ నుంచి వచ్చే దుమ్ముతో నూలుకు సరిగ్గా రంగులు అద్దవు. దాంతో వస్త్రాల నాణ్యత దెబ్బతింటుంది. మార్కెటింగ్ తగ్గి ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

-రాపోలు సత్తయ్య, చేనేత కార్మికుడు, సిరిపురం



సిరిపురంలో కరపత్రం విడుదల చేస్తున్న అఖిలపక్ష నాయకులు

## సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దు

### వర్తక సంఘం ర్యాలీ

రామన్నపేట, అక్టోబర్ 21 : మండల కేంద్రంలో అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని సోమవారం వర్తక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అంబుజా కంపెనీను వ్యతిరేకిస్తూ కరపత్రం విడుదల చేశారు. సియోను సువార్త సంఘం ఆధ్వర్యంలోనూ క్రిస్టియన్ మైనార్టీ నాయకులు, పాస్టర్లు, సంఘ సభ్యులు ప్రతిపాదిత సిమెంట్ పరిశ్రమ గేటు ముందు నిరసన తెలిపారు. సిరిపురంలో సిమెంట్ కంపెనీని వ్యతిరేకిస్తూ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమాల్లో వర్తక సంఘం నాయకులు ఎంఏ వాహెద్, పెండెం భాస్కర్, ఈతపుల రాజు, ఎండీ వహీద్, రాంబాబు, గంజి నరేశ్, షఫీయొద్దీన్, కొంపెల్లి సురేశ్, తమ్మిశెట్టి సందీప్, పవన్, పెండెం సతీశ్, అబ్రహంకుమార్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు ప్రభు వరకుమార్, జేఎస్ మార్టిన్, రేపాల ప్రకాశ్, ప్రేమ్‌సాగర్, కేఎస్ శ్రీనివాస్‌పాల్, సిరిపురం అఖిలపక్షం నాయకులు కూనూరు మత్తయ్య, బండ శ్రీనివాస్‌రెడ్డి, అంబటి మల్లారెడ్డి, బడుగు రమేశ్, బల్గూరి అంజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

## సిమెంట్ ఫ్యాక్టరీని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి

### పెద్దకాపర్తిలో విద్యార్థుల ర్యాలీ

చిట్యాల, అక్టోబర్ 21 : రామన్నపేటలో కాలుష్యం వెదజల్లే సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దంటూ విద్యార్థులు సైతం రోడ్డెక్కారు. అంబుజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో పాఠశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ తీశారు. ప్రజాభిప్రాయ సేకరణలో మండల ప్రజలందరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి జలంధర్ రెడ్డి, అఖిలపక్షం నాయకులు ముద్దసాని రమణారెడ్డి, ఆవుల జానయ్య, చేకూరి గణేశ్, నీలకంఠం లింగస్వామి, మాచర్ల యాదగిరి, సాగర్ల నాగరాజు, ఏర్పుల గణేశ్, పున్న విష్ణు, నూతి తిరుమలేశ్ పాల్గొన్నారు.



పెద్దకాపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## శాంతియుత సమాజంలో పోలీసుల పాత్ర ఎనలేనిది



నల్లగొండ పరేడ్‌గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల స్తూపానికి సెల్యూట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

- పోలీస్ స్టేషన్ అంటే బాధలు తీర్చే కేంద్రం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఫ్లాగ్ డే సందర్భంగా పోలీస్ అమరులకు నివాళి

నీలగిరి, అక్టోబర్ 21 : సమాజాన్ని శాంతియుతంగా ఉంచడంలో పోలీసుల పాత్ర ఎనలేనిదని రాష్ట్ర, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించడానికి సైతం వెనుకాడని సైనికుడు పోలీస్ అని కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం, సమాజ సేవ కోసం అమరులైన పోలీసుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ అంటే భయపట్టే కేంద్రం కాదని, బాధలు తీర్చే కేంద్రమని అన్నారు. జిల్లాలో 15 మంది పోలీసులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక్కో కుటుంబానికి 25 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల కుటుంబాలకు 10 వేల రుపాయల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ రాములునాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్, డీఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న సిమెంట్ పరిశ్రమ గేటు వద్ద బీఆర్ఎస్ నేతలతో కలిసి ధర్నాకు దిగిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## కాలుష్య పరిశ్రమతో అభివృద్ధా? ప్రజలకు హాని చేస్తే ఊరుకోం

- ప్రాణాలను ఫణంగా పెట్టయినా అంబుజా సిమెంట్ పరిశ్రమను అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- పరిశ్రమ గేటు ఎదుట ధర్నా

రామన్నపేట, అక్టోబర్ 21 : కాలుష్యకారక సిమెంట్ పరిశ్రమలతో అభివృద్ధి శూన్యమని, ప్రజలకు హాని కలిగించే పరిశ్రమను ఏర్పాటుచేయాలని చూస్తే ఊరుకునేది లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి అయినా అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుంటామని హెచ్చరించారు. మండల కేంద్రంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ స్థలంలోని గేట్ వద్ద గ్రామ రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదానీతో కుమ్మక్కై లోపాయికారిగా చీకటి ఒప్పందాలు కుదుర్చుకొని సిమెంట్ ఫ్యాక్టరీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు వంద కోట్ల రూపాయల ఫండ్ ఇచ్చిన అదానీ ముఖ్యమంత్రి స్కిల్‌కు ఎన్ని వందల కోట్లు ఇచ్చారోనని అనుమానం వ్యక్తం చేశారు. నాటి కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు, సాగునీరు ఇచ్చి రైతులకు చేయూత అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతుందని మండిపడ్డారు. ఇప్పటికే మూసీ కాలుష్యంతో వెనుకబడిన రామన్నపేటను మరో దామరచర్లగా మార్చవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో మూసీ ఆనావాళ్లు లేకుండా చేయాలని చూస్తుందన్నారు. సిమెంట్ పరిశ్రమ వల్ల ప్రజలు కోలుకోలేని ప్రమాదకర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ఆందోళనవ వ్యక్తం చేశారు. కాలుష్య సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును మానుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబుజా సిమెంట్ పరిశ్రమ మాకొద్దు అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, వేమవరపు సుధీర్‌బాబు, గొరిగె నర్సింహ, దోమల సతీశ్, పున్న వెంకటేశం, మాజీ సర్పంచ్‌లు కోళ్ల స్వామి, మెట్టు మహేందర్‌రెడ్డి, రేఖ యాదయ్య, పట్టణ కార్యదర్శి జాడ సంతోశ్, నాయకులు బద్దుల రమేష్, ఎస్‌కే చాంద్, కూనూరు మత్తయ్య, బత్తుల వెంకటేశ్, మిర్యాల మల్లేశం, బాలగోని శివ, లవణం రాము, రామిని లక్ష్మణ్, కూనూరు శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు బండ శ్రీనివాస్ రెడ్డి, గర్దాసు విక్రం, గుండాల రాంబాబు, పైళ్ల ప్రతాప్‌రెడ్డి, గంగుల రాఘవరెడ్డి, బొల్లం సతీశ్, జినుకల మల్లేష్, బుర్ర శ్రీశైలం పాల్గొన్నారు.

## బదిలీల్లో తప్పుడు స్పౌజ్ ధ్రువపత్రాలు

- ఆరుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

రామగిరి, అక్టోబర్ 21 : ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల్లో కొంత మంది పాల్పడిన అక్రమాలు వెలుగుచూశాయి. తప్పుడు స్పౌజ్ ధ్రుపత్రాలను సమర్పించి బదిలీ అయిన వారిపై డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు ఓ ఉపాధ్యాయ సంఘం ఇచ్చిన ఫిర్యాదుతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించగా, డీఈఓ బి.భిక్షపతి ఆధ్వర్యంలో చేపట్టిన విచారణలో వాస్తవాలు వెలుగుచూశాయి. ఏడుగురు ఉపాధ్యాయుల్లో ఆరుగురు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు తేలడంతో సోమవారం రాత్రి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని సస్పెండ్ చేశారు. కాగా మరొక ఉపాధ్యాయుడిపై విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

### సస్పెండ్ అయిన ఉపాధ్యాయులు వీరే..

- జె.శ్రీరాములు, ఎస్‌జీటీ – ఎంపీపీఎస్, చర్లగౌరారం, కనగల్ మండలం
- ఎ.రజిత, ఎస్ఏ(ఫిజికల్ సైన్స్), జడ్పీహెచ్ఎస్, బాలికలు, తిప్పర్తి మండలం
- ఎ.వెంకట్‌రెడ్డి, ఎస్ఏ (సోషల్), జడ్పీహెచ్ఎస్, గుండ్రాంపల్లి, చిట్యాల మండలం
- పి.శ్రీనివాస్ , ఎస్ఏ (ఫిజికల్ సైన్స్), జడ్పీహెచ్ఎస్, దోమలపల్లి, నల్లగొండ మండలం
- పి.స్వాతి, ఎస్ఏ(గణితం), జడ్పీహెచ్ఎస్, బకల్‌వాడీ, మిర్యాలగూడ మండలం
- జి.సులోచన, ఎస్ఏ(ఫిజికల్ సైన్స్), జడ్పీహెచ్ఎస్, కేశరాజుపల్లి , తిప్పర్తి మండలం

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 21 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, సాధారణ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ–2025 అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అదికారి సుదర్శన్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్డీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ల్ పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అర్హులైన టీచర్లందరూ ఓటు నమోదు చేసుకునేలా చూడాల ఆదేశించారు. జిల్లాలో 3,500 నుంచి 4వేల మంది వరకు అర్హులు ఉండే అవకాశం ఉన్నందున.. వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఎంపీడీఓలు, తాసీల్దార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ప్రధానోపాధ్యాయుల ద్వారా వివరాలు సేకరించాలని సూచించారు. పాఠశాలల్లో లిటరసీ క్లబ్‌లు, కళాశాలల్లో క్యాంపస్ అంబాసిడర్లను నియమించి నియోజక వర్గాల స్వీప్ నోడల్ అధికారుల ద్వారా ఓటు హక్కు వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్, ఆర్డీఓలు శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.




బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కోసం 2కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

- 2కే రన్‌లో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 21 : మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్ సూచించారు. సోమవారం సూర్యాపేట మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన 2కే రన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన ఉంటే ప్రారంభంలోనే వ్యాధిని గుర్తించి, చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. 35 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళ బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుప్రతిలో ఉచితంగా స్క్రీనింగ్ టెస్ట్, మోమోగ్రామ్ చేస్తారని తెలిపారు. కుటుంబంలో ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ ఉంటే ఆ కుటుంబంలోని మహిళలు తరుచూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మెడికల్ కళాశాల ఆవరణ నుంచి మినీట్యాంక్ బండ్ వరకు జరిగిన 2 కే రన్‌లో వైద్యులు శ్రీకాంత్ బట్, సత్యనారాయణ, రమేశ్, యశ్వంత్, ఈశ్వరమ్మ, రాకేశ్, చంద్ర, పావని, రూట్ మేరీ, సునిత, భూలక్ష్మి పాల్గొన్నారు.

# పత్తి తూకాల్లో మోసం

- బస్తాకు 8 కిలోలు తేడా చేసిన దళారీ
- చివ్వెంల మండలంలో వెలుగులోకి



గుంజలూరులో పత్తి లోడు వాహనం

చివ్వెంల, అక్టోబర్ 21 : ఆరుగాలం రైతన్నలు కష్టపడి పండించిన పత్తి పంట చేతికి వచ్చిన సమయంలో దళారులు దోపిడీకి పాల్పడుతున్నారు. కొనుగోళ్లలో తూకాల్లో మోసానికి ఒడిగడ్డి రైతులను దోచుకుంటున్నారు. చివ్వెంల మండలంలో ఇలాంటి ఘటనే వెలుగులోకి వచ్చింది. మండలంలోని గుంజూరు గ్రామానికి ఓ దళారీ పత్తి రైతులను మభ్యపెట్టి కొనుగోళ్లు జరుపుతున్నాడు. రెండు రోజులుగా ఈ తంతు జరుగుతుండగా.. ఒక బస్తాకు 8 నుంచి పది కేజీలు అదనంగా తూకం వేస్తున్నాడు. గ్రామానికి చెందిన కొద్ది మంది రైతుల పత్తి బస్తాలు కాంటాలు వేశారు. కొప్పుల లక్ష్మీనారాయణ 35 బస్తాలు, కొప్పుల జ్యోతి 4 బస్తాలు, పెద్ది బాలకృష్ణ 10 బస్తాలు, కొనకంచి కామేశ్ 10 బస్తాలు కాంటా వేశారు. బస్తాలు బరువును బట్టి రైతులు గమనించి లారీలోకి లోడ్ చేసిన బస్తాలను మళ్లీ కాంటా వేయించారు. మొదట 84 కేజీలు ఉన్న బస్తా తిరిగి కాంటా వేసినప్పుడు 92 కేజీల బరువు తూగింది. దాంతో రైతులు కాంటాలను ఆపేశారు. ఆత్మకూర్(ఎస్) మండలం ఎనుబాముల గ్రామానికి చెందిన వ్యాపారి గుంజలూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా అమ్మకాలు చేపడుతున్నట్లు రైతులు తెలిపారు.

### ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మార్కెట్‌కు పోదామంటే ధర గిట్టుబాటుగా లేదు. రవాణా ఖర్చులు అధికం. దాంతో ఊళ్లోనే అమ్ముకుందామని ఇక్కడ అమ్ముతుంటే దళారులు మోసం చేస్తున్నారు. తూకాల్లో మోసాన్ని రైతులం గమనించకున్నట్లయితే నష్టపోయేవాళ్లం. ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలి.

-పెద్ది బాలకృష్ణ, పత్తి రైతు, గుంజలూరు